రామకృష్ణ . యన్ టి వారి
శ్రీకృష్ణపాండవీయం

టెక్నీషియన్లు

చిత్రానువాదము; దర్శకత్వము	....	యన్. టి. రామారావు, బి.ఎ.
రచన	....	సముద్రాల రామవాచార్య
పాటలు	....	సముద్రాల, కొసరాజు డా॥ సి. నారాయణ రెడ్డి
సంగీతము	....	టి. వి. రాజు
నృత్యం	....	వెంపటి సత్యం
కళ	....	టి. వి. యస్. శర్మ
శబ్దగ్రహణం	....	వి. శివరాం, బి. ఏ., బి.యస్‌సి.
రికార్డిస్టు	....	ఎ. వి, పార్థసారధి
ఛాయాగ్రహణం	....	రవికాంత్ నగాయిచ్
ఎడిటింగు	....	జి. డి. జోషి
వేషధారణ	....	పీతాంబరం, భద్రయ్య
అలంకరణ	....	అచ్యుతరావు
పోరాటములు	....	సాంబశివరావు, స్వామినాథన్
స్టిల్సు	....	ఆర్. యన్. నాగరాజరావు
పబ్లిసిటీ	....	స్టూడియో శర్మ టి. వి. యస్- విజయ పబ్లిసిటీస్, విజయవాడ.
సహకార దర్శకులు	....	బి. హెచ్. విజయరావు రమేష్
నిర్మాణచాలకుడు	....	కె. ఆర్. వి. ప్రసాదరావు

నిర్మాత :

త్రివిక్రమరావు

శ్రీ క్రిష్ణ పాండవీయం

కథాసంగ్రహము

శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో "సాధు సంరక్షణ, దుష్ట శిక్షణ, ధర్మ సంస్థాపన కోసం ప్రతి యుగంలో నేను జన్మిస్తూ వుంటాను" – అని చెప్పారు. ఆ కార్యక్రమంలో పాండవ రక్షణ, కౌరవ శిక్షణ, ఒకటి. యుద్ధంలో అర్జునుణ్ణి నిమిత్తంగా చేశాడు. యుద్ధానికి ముందు భీమసేనుని దుష్ట శిక్షణకు వినియోగించుకొన్నాడు.

పాండురాజు మరణించిన తరువాత పాండవులు తల్లి కుంతీదేవితో హస్తినాపురానికి వచ్చి అక్కడే పెరుగుతున్నారు. కాని కౌరవులు వారిని అనురాగ పాత్రులైన అన్నదమ్ములుగా కాక అసూయాపరులైన దాయాదులుగా భావించి అనేక కష్టాలు కలిగించేవారు. కళ్లారా చూచినా కుంతీదేవి ఏమీ చేయలేక అల్లుడు శ్రీ కృష్ణమూర్తితో తన బాధ వెళ్లబోసుకొని బావలను కాపాడమంటుంది. అలాగేనని ఆ బాధ్యతను పైనవేసుకొన్నాడు వాసుదేవుడు.

దుర్యోధనుడు పాండవులను కాశీలో లక్కయింటిలో పెట్టి దహనం చేయాలని తన మిత్రులు, మామ శకునితో పన్నాగం చేసి, నయానా, భయానా, చెప్పి తండ్రిని అందుకు ఒప్పిస్తాడు. ధర్మరాజు ఆ దుస్తంత్రం తెలుసుకో లేక పెద్దలవద్ద సెలవు తీసుకొని కాశికి వెళతాడు. శ్రీ కృష్ణుడు కాశీ నగరానికివచ్చి, జరిగిన మోసం భీమసేనునికి తెలియజేసి, ఆ ఇంటిలో నుంచి వెలుపలికి బిలం త్రవ్వమని చెపుతాడు. జాగరం చేస్తానని మాట తీసికొంటాడు. కన్ను మూయకుండా కాపాడతాడు. నిర్ణీతదినాన కౌరవ దూతలు లక్కయింటికి నిప్పు పెట్టగానే పసిగట్టి వారిని ఆ మంటల్లో వేసి బావ మాట ప్రకారం బిల మార్గాన భీముడు, అన్నదమ్ములను, తల్లిని తప్పించి తీసుకు పోతాడు.

ఒకచోట తల్లినీ, అన్నదమ్ములను, పెట్టి భీమసేనుడు కాపలాకాస్తూ ఉండగా హిడింబుడనే రాక్షసుడు వాసనబట్టి వారిని తెమ్మని చెల్లెలు హిడింబిని పంపుతాడు. ఆమెవచ్చి భీమసేనుని రూపంచూచి మెచ్చి తన్ను పెళ్ళాడమని అర్థిస్తుంది. ఆలస్యానికి ఆగలేక హిడింబుడు వచ్చి భీమునితో తారసిల్లి చనిపోతాడు. తల్లికోరిక మీద హిడింబిని భీమసేనుడు పెళ్ళాడతాడు. శ్రీ కృష్ణుడు వచ్చి నూతన దంపతులను ఆశీర్వదిస్తాడు. కుంతి

కృష్ణుని పెళ్లిమాట తెస్తుంది. " ఆ సుముహూర్తం వచ్చినప్పుడు సతీసమేతంగా వచ్చి నేనే నీ ఆశీస్సులు పొందుతాలే అత్తా! " అంటాడు వాసుదేవుడు.

నారదుడు రుక్మిణీ దేవికి కృష్ణ మంత్రోపదేశం చేసి స్మరించ మంటాడు. తప్పకుండా స్వామి నీ కోరిక తీర్చి నిన్ను తరింపజేస్తాడంటాడు. కాని మగధ సామ్రాట్ జరాసంధుడు రుక్మిణిని శిశుపాలునికిచ్చి పెళ్లి చేయించటానికి ఆమె అన్న రుక్మిచేత వాగ్దానం పుచ్చుకొంటాడు. నారదుని సలహాతో రుక్మిణి తనకు గురుతుల్యుడైన విప్రుని ద్వారా పరిస్థితులు కృష్ణస్వామికి వివరించి తనను రక్షించమని రాయబారం పంపుతుంది. దేవీ పూజకు వచ్చిన రుక్మిణీ దేవిని తీసికొని రథారూఢుడై కృష్ణుడు ద్వారకకు వెళతాడు. కళ్యాణమండపంలో కన్నెకోసం ఎదురు చూస్తున్న శిశుపాలాది రాజలోకం ఉద్రిక్తులై కృష్ణుని వెంటపడతారు. దంతవక్త్రుని చంపి, రుక్మిని పరాభవించి ద్వారవతికి చేరి శ్రీ కృష్ణుడు రుక్మిణీ దేవిని పెళ్ళాడతాడు.

అనాడిచ్చినమాట మేరకు ఏకచక్రపురంలో ప్రచ్ఛన్న జీవితం గడుపుతున్న అత్తవద్దకు వెళ్లి పుణ్యదంపతులు దీవెనలందుతారు.

బకుడనే రాక్షసి ఏకచక్ర పురప్రజలను పీడించుకుతింటూ ఉన్నాడు. ఒప్పందం ప్రకారం అనాడు నరబలి యీయవలసినవంతు పాండవులుండే ఇంటి బ్రాహ్మణులది. నేనంటే నేనని వారు వంతులు వేసుకొని వాపోతున్నారు. ఆ దుస్థితి చూచి వారిని ఓదార్చి కుంతీదేవి భీమసేనుని పంపించింది. బండిమీదుండిన బోజనమంతా భోంచేసి బకాసురుణ్ణి మట్టుపెట్టి భీముడు విజయోత్సాహంతో తిరిగి వచ్చాడు.

ద్రుపద మహారాజుకు తన కూతురు ద్రౌపదిని అర్జునునికి ఇవ్వాలని ఆశ. పాండవులు లాక్షాగృహంలో దగ్ధమైనందున ఆ అవకాశం తప్పిపోయిందని వాపోతుండగా నారదుడు ద్రుపదునికి, పాండవులు సజీవులేనని, స్వయంవరం చాటిస్తే అర్జునుడే వచ్చి మత్స్య యంత్రం ఛేదించి ద్రౌపదిని పెళ్లాడతాడని చెపుతాడు.

ఏకచక్రపురంలో భిక్షాటన చేస్తున్న అర్జునుడు స్వయంవరం వార్త విని ద్రుపద నగరానికి బయలుదేరతాడు. స్వయంవరానికి నానా దేశాధీశ్వరులు వస్తారు. వచ్చినవారంతా, తుదకు కర్ణునితోసహా నీటిలో నీడ చూచి మత్స్య యంత్రాన్ని పడగొట్టలేకపోతారు. అప్పుడు విప్రవేషధారియైన అర్జునుడు వచ్చి ఆ యంత్రాన్ని పడగొడతాడు. కల్యాణం పూర్తికాగానే అర్జునుడు ద్రౌపదిని తీసికొని తల్లివద్దకు వెళ్లి ఒక అపూర్వమైన కానుక తెచ్చానంటాడు. అన్నదమ్ములందరూ సమంగా పంచుకోండి అంటుంది.

అడపిల్లని తెలిసి అమె నివ్వెరపోతుంది. వాసుదేవుడు వచ్చి ద్రౌపది పూర్వ జన్మ కథ చెప్పి ఆ దీవెన క్రమమేనని చెపుతాడు.

పెద్దలమాట త్రోసివేయలేక అంధరాజు, విదురుని పంపి పాండవులను హస్తినాపురికి పిలిపిస్తాడు. పశ్చాత్తప్త హృదయుడై ధర్మరాజును చేరదీసి గతం మరచిపొమ్మని సాపాలు రాజ్యం పంచియిస్తాడు. ఈ నిర్ణయానికి కురురాజు కంటగించుకొంటాడు.


శ్రీ కృష్ణుడు - ఇంతటితో ప్రమత్తులై ఉండరాదనీ - మిత్ర శత్రు నిర్ణయంచేసుకోటానికి రాజసూయం చేయమని పాండవులను ప్రోత్సహించి, భీమసేనుని వెంటతీసికొని జరాసంధుని మట్టుబెట్టటానికి వెళతాడు. బ్రాహ్మణ వేషధారులై అంతఃపురం ప్రవేశించి జరాసంధుణ్ణి నిద్రలేపి రణ భిక్ష కోరతారు. జరాసంధుడు, మోసం తెలిసి కూడా సమవీరుడైన భీమసేనునితోనే పోరాడతాడు. శ్రీ కృష్ణుని సూచన గ్రహించిన భీముడు జరాసంధుని చీల్చి యెడాపెడా పారవేసి అతని కడతేర్చుతాడు.

పాండవుల రాజసూయాహ్వానం కౌరవులకు కూడా వస్తుంది. శకుని మామ సలహా పాటించి కురురాజు బంధు మిత్రులతో తరలి ఇంద్రప్రస్థం వస్తాడు. అఖండ స్వాగతంతో రారాజును పాండవులు గౌరవించి మయ సభలో విడిది ఏర్పాటు చేస్తారు. అచ్చటి శిల్ప సౌందర్యాలు చూచి కురురాజు భ్రమిస్తాడు. భంగపడతాడు. పాంచాలి పరిహసించిందను కొంటాడు. ఆక్రోశంతో అందరూ అప్పుడే ప్రతీకారం చేస్తామంటారు. శకుని అడ్డుపడి అది తరుణంగానీ, మార్గంకానీ కాదనీ, మంచిగా తన పాచికలతో వంచించి, పరిహసించిన పాంచాలిని కురురాజు పేరోలగంలో వివస్త్రగా నిల్పి పరాభవిస్తానని వాగ్దానం చేస్తాడు.

రాజసూయం సంపూర్ణమవుతుంది. ధర్మరాజు పితామహుని అనతిపై వాసుదేవునికి అగ్రపూజ జరిపిస్తాడు. " ఇందరు మహర్షులు, మహారాజులుండగా యాదవునికి అగ్రపూజా! " అని శిశుపాలుడు ఆవేశోద్రేకాలతో శ్రీ కృష్ణుని నిందిస్తాడు. శిశుపాలుని తల్లికిచ్చిన మాట ప్రకారం నూరు తప్పులు కాచి తరువాత చక్రంతో శ్రీ కృష్ణుడు అతని శిరస్సు ఖండించివేస్తాడు. తన విశ్వస్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. భీష్మాదులందరూ వినమ్రులై నమస్కరిస్తారు.

శ్రీ కృష్ణుడు ఆశ్రితులకు అభయం ఇస్తాడు.

శుభమ్



పాట : 1

రచన - కొసరాజు   పాడినది — ఘంటసాల

కృష్ణుడు — ముసలి బ్రాహ్మణుడు :

అపాయమ్ము దాటడాని కుపాయమ్ము కావాలి !
అంధకార మలమినపుడు వెలుతురుకై వెతకాలి !
ముందు చూపులేనివాడు - ఎందునకూ కొరగాడు.
సోమరియై తిరుగువాడు సూక్ష్మమ్ము గ్రహించలేడు !

మత్తువదలరా - నిద్దుర మత్తువదలరా !
ఆ మత్తులోనపడితే - గమ్మత్తుగ చిత్తౌదువురా ॥ మత్తు ॥

జీవితమున సగభాగం - నిద్దురకే సరిపోవు
మిగిలిన ఆ సగభాగం - చిత్తశుద్ధిలేకపోవు
అతి నిద్రాలోలుడు - తెలివిలేని మూర్ఖుడు
పరమార్థం కానలేక - వ్యర్థంగా చెడతాడు ॥ మత్తు ॥

సాగినంతకాలం - నా అంతవాడు లేరందురు
సాగకపోతే ఊరక చతికిలబడిపోదురు
కండబలముతోటే మనకార్యము సాధించలేరు
బుద్ధిబలము తోడైతే విజయమ్ము వరించగలరు ॥ మత్తు ॥

చుట్టు ముట్టు ఆపదలను - మట్టుబెట్ట బూనుమురా !
పిరికి తనము కట్టిపెట్టి - ధైర్యము చేపట్టుమురా !
కర్తవ్యము నీ వంతు - కాపాడుట నా వంతు !
చెప్పడమే నా ధర్మం - వినకపోతే నీ ఖర్మం ! ॥ మత్తు ॥

పాట : 2

రచన - డా॥ సి. నారాయణరెడ్డి   పాడినది — జిక్కి

హిడింబి :

ఛాంగురే - ఛాంగురే బంగారు రాజా ! ఛాంగు ఛాంగురే బంగారు రాజా !
మజ్జారే మగరేడా - మత్తైన వగకాడా !
అయ్యారే ! నీకే మనసియ్యాలని వుందిరా ॥ ఛాంగురే ॥

ముచ్చటైన మొలక మీసముంది - భళా ! అచ్చమైన సింగపు నడుముంది !
జిగి బిగీ మేనుంది - సొగసులొలుకు మోముంది
మేటి దొరవు అమ్మక చెల్ల ! నీ సాటి ఎవ్వరుండుట కల్ల ॥ ఛాంగురే ॥

కైపున్న మచ్చకంటిచూపు - అది చూపుకాదు పచ్చలపిడిబాకు
పచ్చలపిడిబాకో - విచ్చిన పువురేకో !
గుచ్చుకుంటె తెలుస్తుందిరా - మనసుచ్చుకుంటె తెలుస్తుందిరా ॥ ఛాంగురే ॥

గుబులుకొనే కోడెవయసులెస్స - దాని గుబాళింపు ఇంకా హైలెస్స
పడుచుదనపు గిలిగింత - గడుసు గడుసు పులకింత
ఉండనీయవేమిసేతురా - కైదండలేక నిలువలేనురా ॥ ఛాంగురే ॥

పద్యము : 1

రచన - భాగవతము   పాడినది — పి. బి. శ్రీనివాస్

నారదుడు :

నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై
జల్లెడువాడు మౌళిపరిసర్పితపింఛమువాడు నవ్వురా
జిల్లెడు మోమువాడు - మనసిచ్చిన కోరికలిచ్చువాడు శ్రీ
వల్లభుడైన శౌరియదు వల్లభు భక్తిని పూజసేయుమా.

పద్యము : 2

రచన - సముద్రాల   పాడినది — మాధవపెద్ది

జరాసంధుడు :

దుర్మదాంధుడు - బాంధవద్రోహి - కపటి
పరమనీచుడు యాదవార్భకుడు నన్ను

ధిక్కరించునే - ఆ పగ దీరువరకు
శాంతిగనునే జరాసంధ చక్రవర్తి

పాట : 3

రచన - సముద్రాల — పాడినది — పి. బి. శ్రీనివాస్

నారదుడు :

ఏమిటయా నీ లీల - కృష్ణా! ఏమిటయా నీ లీల
ఎందులకీ గోల - మాయాలోలా ॥ ఏమి ॥

మట్టి బొమ్మలకు ప్రాణముపోసి - మతినొసగి మదమత్తులజేసి
అధార్మికుల అణగార్చు నెపాన - అవతారము ధరియింతువయా ॥ ఏమి ॥

పరమాత్ముడవై నరులవిధాన - నరసాల గొడవలో చొరబడియేవు
కన్నియ ఇంట కలతలురేపి - కల్యాణానికే సిద్ధమయేవు ॥ ఏమి ॥

పాట : 4

రచన - సముద్రాల — పాడినది — ఘంటసాల, సుశీల

కృష్ణుడు — రుక్మిణి :

కృ : ప్రియురాల సిగ్గేలనే - నీ మనసేలు మగవానిజేరి ॥ ప్రియు ॥

రు : నాలోన ఊహించిన - కల లీనాడు ఫలియించె స్వామీ ॥ నాలోన ॥

కృ : ఏమీ ఎరుగని గోపాలునికి - ప్రేమలేవో నేరిపినావు
మనసుదీర పలుకరించి - మా ముద్దు ముచ్చట చెల్లించవే ॥ ప్రియు ॥

రు : ప్రేమలు తెలిసిన దేవుడవని విని - నా మదిలోన కొలిచితిని
స్వామివి నీవని తలచి నీకే బ్రతుకే కానుకజేసితిని ॥ నాలోన ॥

కృ : సమయానికి తగు మాటలునేర్చిన - సరసురాలవే ఓ భామా!
ఇపుడేమన్నా ఒప్పనులే - ఇక ఎవరేమన్నా తప్పదులే ॥ ప్రియు ॥

పద్యము : 3

రచన - భాగవతము — పాడినది — సుశీల

రుక్మిణి :

ప్రాణేశ నీమంజు భాషలు వినలేని - కర్ణ రంధ్రంబుల కలిమియేల
పురుషరత్నమ! నీవు భోగింపగాలేని - తనులతవలని సౌందర్యమేల
భువన మోహన నిన్ను పొడగానగాలేని - చక్షురింద్రియముల సత్యమేల
దయిత! నీయధరామృతం బానగాలేని - జిహ్వకు ఫలరస సిద్ధియేల
నీరజాత నయన! నీ వనమాలికా - గంధ మబ్బలేని ఘ్రాణమేల
ధన్యచరిత! నీకు దాస్యంబు చేయని - జన్మమేల వేయి జన్మలకును

పాట : 5

రచన - సముద్రాల — పాడినది — పి. బి. శ్రీనివాస్

[పల్లవి] అగ్నిద్యోతనుడు :

కృష్ణా! యదుభూషణా! హే కృష్ణా! యదుభూషణా!
గోవిందా! ముకుందా! హే పావనా! ॥ కృష్ణా ॥

పద్యము : 4

రచన - భాగవతము — పాడినది — సుశీల


రుక్మిణి :

నమ్మితి నామనంబున సనాతనులైన ఉమామహేశులన్
మిమ్ము పురాణ దంపతుల మేలు భజింతుగదమ్మ మేటి పె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిన్ పతి సేయుమమ్మ! నిన్
నమ్మిన వారి కెన్నటికి నాశములేదు గదమ్మ! ఈశ్వరీ!

పాట : 5

[చరణము 1] అగ్నిద్యోతనుడు :

దీనుల పాలిటి దైవము నీవట - అమరులనేలెడి అయ్యవు నీవట!
భక్త కోటికి చింతామణివట - నినునెరనమ్మిన లోటేరాదట ॥ కృష్ణా ॥



పద్యము : 5

రచన - భాగవతము — పాడినది — సుశీల

రుక్మిణి :

ఘనుడా భూసురుడేగెనో నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో
విని కృష్ణుండది తప్పుగా దలచెనో ! విచ్చేయునో ! ఈశ్వరుం
డనుకూలింప దలంచునో దలపడో - ఆర్యా మహాదేవియున్
నను రక్షింప నెరుంగునో, ఎరుగదో ! నా భాగ్య మెట్లున్నదో !

పాట : 5

[చరణము 2] అగ్నిద్యోతనుడు :

అఖిలము నెరిగిన అంతర్యామికి - వివరించే పని లేదుగదా !
నమ్మిన కొమ్మను ఏలుకొమ్మని - రమ్మని పిలచుట నా భాగ్యమెగా ॥ కృష్ణా ॥

పద్యము : 6

రచన - భాగవతము — పాడినది — సుశీల

రుక్మిణి :

లగ్నంబెల్లి వివాహముం గదిసె ఏలారాడు గోవిందుడు
ద్విగ్నంబయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతను డేటికిన్ దడసెనో - యత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో - విరించి కృతమెబ్భంగిన్ ప్రవర్తించునో

పద్యము : 7

రచన - భాగవతము — పాడినది — పి. బి. శ్రీనివాస్

అగ్నిద్యోతనుడు :

ఆ ఎలనాగ నీకు తగు - అంగనకున్ తగుదీవు మా యుపా
ధ్యాయుల యాన పెండ్లియగు తప్పదు జాప్యములేల నీవు నీ
తోయము వారి గూడుకొని తోయరుహాననదెత్తు గాని - వి
చ్చేయుము శత్రులన్ నురుము సేయుము - సేయుము శోభనంబిలన్

పద్యము : 8

రచన - భాగవతము — పాడినది — పి. బి. శ్రీనివాస్, సుశీల

అగ్నిద్యోతనుడు – రుక్మిణి :

అంకిలి సెప్పలేదు చతురంగ బలంబులతోడనెల్లి ఓ
పంకజనాభ ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువజేసి కృష్ణ ! పురుషోత్తమ ! చేకొని పొమ్ము వచ్చెదన్

పద్యము : 9

రచన - భాగవతము — పాడినది — ఘంటసాల

కృష్ణుడు :

వచ్చెద విదర్భ భూమికి
జొచ్చెద భీష్మకుని పురము సురుచిర లీలన్
తెచ్చెద బాలన్ బ్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చిన పోరన్

పద్యము : 10

రచన - భాగవతము — పాడినది — ఘంటసాల

నేపథ్యము :

కనియెన్ రుక్మిణి చంద్రమండల ముఖున్ కంఠీరవేంద్రావ ల
గ్నున వాంభోజ దళాక్షు చారుతర వక్షున్ మేఘ సంకాశ దే
హునగా రాతి గజేంద్ర హస్తనిభ బాహున్ చక్రి పీతాంబరున్
ఘన భూషాన్వితు కంబు కంఠు విజయోత్సాహున్ - జగన్మోహనున్.

పద్యము : 11

రచన - భాగవతము — పాడినది — మాధవపెద్ది

జరాసంధుడు :

బ్రతుకవచ్చు నొడల ప్రాణంబులుండిన
బ్రతుకు కలిగెనేని భార్య కలదు

బ్రతికి తీవు భార్య పట్టు దయ్యామెరుంగు
వగవ వలదు చైద్య - వలదు వలదు !

పద్యము : 12

రచన - భాగవతము　　పాడినది — మాధవపెద్ది

రుక్మిణి :

మాసరి వాడవా మా పాప గొనిపోవ - ఏపాటి గలవాడ వేదివంశ
మెందు జన్మించితి వెక్కడ పెరిగితి - వెయ్యది నడవడి ఎవ్వడెరుగు
మాన హీనుడ వీవు మర్యాద లెరుగవు - మాయగైకొని గాని మలయరావు
నిజరూపమున శత్రు నివహంబుపైబోవు వసుధేశుడవుకావు - వావిలేదు కృష్ణా!
కొమ్మనిమ్ము నీవు గుణరహితుండవు - విడువు విడువవేని విలయకాల
శిఖి శిఖా సమాన శిత శిలీ ముఖముల - గర్వమెల్లగొందు కలహమందు.

పద్యము : 13

రచన - భాగవతము　　పాడినది — పి. బి. శ్రీనివాస్

నారదుడు :

తలమనక భీష్మనందను
తలయును మూతియును గొరుగ తగవే బంధున్
తలయును మూతియు గొరుగుట
తలదరుగుటకంటె తుచ్ఛ తరము మహాత్మా !

పద్యము : 14

రచన - భాగవతము　　పాడినది — పి. బి. శ్రీనివాస్

నారదుడు :

తగు నీ చక్రి విదర్భరాజ సుతకున్ తథ్యంబు వైదర్భియున్
తగు నీ చక్రికి ఇంతమంచి దగునే దాంపత్య మీ ఇద్దరన్
తగులన్ గట్టిన బ్రహ్మ నేర్పరిగదా దర్పాహతారాతియై
మగడైనాడుగ చక్రి ఈ రమణికిన్ - మా పుణ్య మూలంబునన్

పాట : 6

రచన - సముద్రాల　　పాడినది — జిక్కి, యల్. ఆర్. ఈశ్వరి

రుక్మిణి చెలియలు :

నల్లని వాడైనా - ఓ చెలీ - చల్లనివాడేలే !
గోవుల గాచెడి వాడైనా - నీ గొప్పకు తగ్గని వాడే చెలీ　॥ నల్లని ॥
మురళీ మోహనుని - చెలీ, మురిపించిన జాణవులే !
మా గోపాలుని ఇల్లాలివౌట - నీ భాగ్యమె భాగ్యము
ఇలవేలుపులౌ మిమ్ముల జూచి - తరియించెను మా జన్మలే　॥ నల్లని ॥
మనసే పందిరియై - చెలీ, నీ వలపులు పూలతలై
అనురాగాలే పరిమళించి - ఆనందము నీయగా
మీ ప్రియగాథ - యుగయుగాలకు - కథగా నిలచునులే ఓ చెలీ　॥ నల్లని ॥

పద్యము : 15

రచన - సముద్రాల　　పాడినది — ఘంటసాల

నేపథ్యము :

ప్రీతి నర్థుల నాదరించు ధర్మసుతుండు - పరుల ఆదరమ్మున బ్రతుకవలసె
కొండలైనను పిండి గొట్టెడు భీముడు - అర్తుడై చేసాచి అడుగవలసె
అరిభయంకర ధనుర్ధరుడైన పార్థుడు - పరువును విడి జోలె పట్టవలసె
కవికి వెన్నెల సోక కందిపోవు కవలు - ఎండలో బిచ్చము నెత్తవలసె
తిరిపెపుం బువ్వ నాకలి దీర్చుకొనుచు
ఒరుల పంచను కాపుర ముండవలసె
బ్రాహ్మణాకృతి పాండు భూపాలసుతులు
కటకటా ! ఎంత చిత్రమీ కాలమహిమ.

పాట : 7

రచన - కొసరాజు　　పాడినది — మాధవపెద్ది

భీముడు :

ఓ హెహాహెహా....................
భళాభళీ నా బండీ - పరుగుతీసే బండి
బండిలో తిండి జూడ - బ్రహ్మకు నోరూరునండీ　॥ భళా ॥

తిండి లేనిదే కండలేదురా! కండలేనిదే గుండెరాదురా! హే తమ్ముడూ!
గుండెదిటవుగానున్నచో - బ్రహ్మాండములోనే ఎదురు లేదురా
కరకర ఆకలి మండుతువుంటే - కమ్మని భోజన మెదురుగవుంటే
గుటకలు మ్రింగుచు కూర్చొనువాడు - ఉంటేవాడు వెర్రివాడు ॥ భళా ॥

అట్టురా! మిన పట్టురా! దీన్నదిలి పెట్టే దెట్టురా!
తీపి తీపి బొబ్బట్టురా! అహ తింటే ఆకలి కట్టురా!
పప్పుతోటి ముద్దగలిపి - పచ్చడితో అనుపానమేసి
బక్కప్రేగులకు పట్టిస్తుంటే - చెప్పశక్యమా దీనిరుచి ॥ భళా ॥

సాటిలేని జగజెట్టి భీముని - చేతుల తీట తీరునులే
అరి చేతుల తీట తీరునులే
ఏకచక్ర పురవాసుల బెడద - నేటితోనె పడి మారునులే
తల్లి ఋణమ్మును తీర్చెద - నా ధర్మమ్మును నెరవేర్చెద
ఓ ఆత్మబంధూ! నీ అండ వుంటే ఎవరడ్డమైన పరిమార్చెద ॥ భళా ॥

పద్యము : 16

రచన - సముద్రాల పాడినది — మాధవపెద్ది

జరాసంధుడు :

సాటిరాజందునా శాపోపహతమైన - యదువంశమున జన్మ మందినావు
సరి వీరుడందునా సమరాన వెన్నిచ్చి - ద్వారకా నగరిలో దాగినావు
గుణశాలి వందునా కూరిమి జూపిన - మామపైబడి హత మార్చినావు
మతిమంతు డందునా మరది ప్రేమించిన - అబలహరించి పెండ్లాడినావు
మూతిమీదను మీసమే మొలవనట్టి - పేడివగు నీవు నాసరి జోడుకావు
మీసలను దీసినను బల్ రోసమున్న - భీమసేనుడె నాకు ఉజ్జీముకుందా!

పాట : 8

రచన - డా ॥ సి. నారాయణ రెడ్డి పాడినది — సుశీల, లీల

మయసభ అంగనలు :

స్వాగతం! సుస్వాగతం!
స్వాగతం! కురుసార్వభౌమా! స్వాగతం!
శతసోదర సంసేవిత సదనా - అభిమానధనా సుయోధనా ॥ స్వాగ ॥

మచ్చలేని నెలరాజువు నీవే - మనసులోని వలరాజువు నీవే
రాగభోగసుర రాజువు నీవే - రాజులకే రారాజువు నీవే
ధరణిపాల శిరోమకుటమణి తరుణకిరణ పరిరంజిత చరణా ॥ స్వాగ ॥

తలపులన్ని పన్నీటిజల్లులై - వలపులన్ని విరజాజి మల్లెలై
నిన్ను మేము సేవించుటన్నది - ఎన్ని జన్మముల పుణ్యమో అది
కదనరంగ బాహుదండ ధృతగదా ప్రకట పటుశౌర్యాభరణా ॥ స్వాగ ॥

పద్యము : 17

రచన - సముద్రాల పాడినది — పిఠాపురం

శిశుపాలుడు :

పిట్ట నొకదాని పడమొత్తి గుట్టనెత్తి
బురద పామును చేబట్టి బుగిలియున్న
మద్దులను గూల్చి ముదుసలి ఎద్దు గెల్చి
బల్లిదుడనన్న మల్లులు గొల్లుమనరె!

పద్యము : 18

రచన - సముద్రాల పాడినది — పిఠాపురం

శిశుపాలుడు :

పాలు దాపగావచ్చిన పడతి యుసురు
చూరగొన్నావు ప్రేమతో చేర బిలుచు
సజ్జనుని మేనమామను చంపినావు
హంతకుడవెట్లు గైకొందు వగ్రపూజ

పద్యము : 19

రచన - సముద్రాల పాడినది — పిఠాపుర

శిశుపాలుడు :

కన్ను మరుగైన వెన్నమీగడ హరించి
మాయ లెరుగని మగువల మదిగలంచు
చోర జారాగ్రణివి సదాచారుడవని
పొగడ తలయూప నీకైన బుద్ధిలేదె!

పద్యము : 20

రచన - సముద్రాల — పాడినది — పిఠాపురం

శిశుపాలుడు :

అత్త కొడుకుకు నిశ్చయంబైన కన్నె
చెల్లెలగుగాదె ఆమెను చెట్టబట్టి
కులుకునిను దేవుడని మెచ్చుకొంద్రుగాక
నీదుదాసులు - నేను మన్నింప కృష్ణా!

పద్యము : 21

రచన - సముద్రాల — పాడినది — ఘంటసాల

కృష్ణుడు :

వికృతరూపుని నిన్ను చూపించునాడు
అత్త కొసగినమాట పోనాడ లేక
కాచితిని నూరు తప్పులీ క్షణముతోడ
చెల్లిపోయెనీ ఆయువు చేదిరాజ!